క్లుప్తంగా

ఘనంగా ఏకాహం



ఆర్యావటం రామాలయంలో ఏకాహంలో భజనలు చేస్తున్న భక్తులు

కాజులూరు: మండలంలోని ఆర్యావటం వనుం వారిపేట రామాలయంలో మంగళవారం ఏకాహాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతిర్లింగార్చనతో భజనలు ప్రారంభించారు. పరిసర గ్రామాలకు చెందిన పలువురు భజనబృందం సభ్యులు పాల్గొని రాత్రి వరకూ నిర్విరామంగా భక్తిగీతాలు ఆలపించారు. ఏకాహంలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. గ్రామ శ్రేయస్సు దృష్ట్యా శ్రీరామచంద్రుడిని ప్రార్థిస్తూ ఈ ఏకాహాన్ని నిర్వహిస్తున్నామని పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

రామచంద్రపురం ఏపీఓగా లక్ష్మీగణపతి



రామచంద్రపురం రూరల్: మండల ఉపాధి హామీ శాఖ ఏపీఓగా కాలా లక్ష్మీగణపతి మంగళవారం విధుల్లో చేరారు. ఆయన కె.గంగవరం మండల ఇన్‌చార్జి ఏపీఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై రామచంద్రపురం వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న మోర్త ఈశ్వర రావు జేఈగా కొనసాగనున్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



మెర్ల వీరరాఘవ (ఫైల్)

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి మెర్ల వీర రాఘవ (62) మామిడి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. అంగర పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 5న శ్రీరామనవమి సందర్భంగా రామాలయానికి తోరణాలు కట్టే నిమిత్తం మామిడాకులు కోసేందుకు వీర రాఘవ టేకి వ్యవసాయ క్షేత్రంలోని మామిడి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేర్చగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. భార్య సాయి ఫిర్యాదు మేరకు అంగర పోలీసులు కేసు నమోదు చేశారు.

పీఆర్ జేఈఈ సత్యనారాయణ ఆకస్మిక మృతి



సత్యనారాయణ(ఫైల్)

రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ జేఈఈగా విధులు నిర్వహిస్తున్న కేవీవీ సత్యనారాయణ మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. పంచాయతీరాజ్ జేఈఈ రామనారాయణ పదవీ అనంతరం అమలాపురం టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీవీ సత్యనారాయణ సాధారణ బదిలీల్లో భాగంగా రాయవరం పంచాయతీరాజ్ జేఈఈగా గత నెల 29న విధుల్లో చేరారు. కాగా సత్యనారాయణ స్వగ్రామమైన చీడిగలో గుండెపోటుతో మృతి చెందడంతో మండల పరిషత్ కార్యాలయంలో సహచర ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

గోదావరిలో నడచి వెళ్లవద్దు

కొత్తపేట/ఆలమూరు: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణ, తీర్థ మహోత్సవాలకు ఎవరూ గౌతమి గోదావరి నదిలో నడచి వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. నెల 7 నుంచి 13 వరకూ వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణం, తీర్థం జగురుతున్న విషయం తెలిసిందే. గతంలో వాడపల్లి–బడుగువానిలంక మధ్య గౌతమి గోదావరి నది దాటి వెళుతూ పలువురు గల్లంతై మృత్యువాత పడ్డారు. ఆ ఉదంతాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఆలమూరు, కడియం మండలాల నుంచి భక్తజనం బడుగువానిలంక, ఇతర లంక గ్రామాల మీదుగా ఎవరూ గోదావరిలో నుంచి నడచి వాడపల్లి వెళ్లవద్దని హెచ్చరించారు. ఆ మేరకు వివిధ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు దండోరా ద్వారా టాం టాం వేయించారు.

వ్యాధులపై అవగాహన

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్ అధ్యక్షతన వహించగా జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వర రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు.

కూలీలకు ఊరట

- ఉపాధి కూలీలకు పెరిగిన వేతనం
- మరో రూ.7లు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- పెరిగిన కూలి నేటి నుంచి అమలు
- నియోజకవర్గాల పరిధిలో 73,820 కుటుంబాలకు ప్రయోజనం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాయవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఉగాది కానుకగా కూలి రేటును పెంచింది. అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న కూలీలకు కొంత ఊరట నిచ్చినట్టు అయింది. ఎండల తీవ్రత అధికంగా ఉన్న ఏప్రిల్, మేలలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతుంటాయి. ఈ సమయంలో పనులకు వచ్చే కూలీలకు ప్రయోజనం లభించేలా గతంలో కేంద్రం అదనపు భత్యం చెల్లించేది. అయితే గత రెండేళ్లగా అదనపు భత్యాన్ని నిలిపి వేసి, కూలి రేటును పెంచుతోంది. అందులో భాగంగా తాజాగా దినసరి కూలి మరో రూ.7లు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తాజా నిర్ణయం అమలులోకి వస్తుంది. దీని ఫలితంగా క్లస్టర్ పరిధిలోని కూలీలకు లబ్ధి చేకూరనుంది.

రూ.307లకు పెరిగిన కూలి

గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేని కూలీలు వలసలు వెళ్తున్నారు. వలసలను అరికట్టి స్థానికంగా వారికి వంద రోజుల పాటు పని కల్పించాలనే ఉద్దేశంతో 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. జాబ్ కార్డు కలిగిన వారికి చెరువులు, కాలువలు, మొక్కలు నాటడం, సంరక్షించడం, వ్యవసాయ భూముల సంరక్షణ వంటి పనులను కల్పిస్తున్నారు. పథకం ప్రారంభంలో రోజు వారీ కూలి రూ.87.50లుగా ఉండగా, నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలకు లబ్ధి చేకూర్చేలా కూలి సైతం క్రమంగా పెంచుతూ వస్తున్నారు. 2022లో రూ.12 పెంచగా, 2023లో రూ.15 పెంచారు. గతేడాది అత్యధికంగా రూ.28 పెంచడంతో రోజు వారీ కూలి రూ.300లకు చేరింది. తాజాగా మరో రూ.7లు పెంచడంతో ఇది రూ.307లకు చేరింది. ప్రస్తుతం రోజు వారీ సగటు కూలి రూ.307 చెల్లిస్తున్నారు.

ఇదీ లెక్క..

- నియోజకవర్గాలు: రామచంద్రపురం, మండపేట.
- మండలాలు: రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం.
- మొత్తం జాబ్ కార్డుల సంఖ్య: 73,820
- కూలీల సంఖ్య: 1,23,282
- యాక్టివ్ జాబ్ కార్డుల సంఖ్య: 52,647
- యాక్టివ్ కూలీలు: 85,444
- ఇప్పటి వరకు కూలీలకు చెల్లించిన వేతనాలు: రూ.37.92 కోట్లు
- మెటీరియల్ రూపంలో చెల్లించిన సొమ్ము: రూ.8.16 కోట్లు

క్లస్టర్‌లో పరిస్థితి ఇదీ

మరో పది రోజుల్లో రబీ పనులు ప్రారంభం కానున్నాయి. రబీ పనులు ప్రారంభమైనప్పటికీ వరి కోత యంత్రాల సహాయంతోనే ఎక్కువగా వరి కోతలు జరిగే అవకాశముంది. ఇదిలా ఉంటే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో ఉపాధి హామీ పనులను జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అధికారుల పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు. ఉపాధి పనులను క్లస్టర్ పరిధిలోని 94 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షణ చేస్తున్నారు. అలాగే క్లస్టర్ పరిధిలో 73,820 మంది ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. క్లస్టర్ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో యాక్టివ్‌గా ఉన్న ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించారు. ఇప్పటి వరకు 85,444 మంది కూలీలకు పని కల్పించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రోజుకు రూ.300 వంతున ఉపాధి వేతనం చెల్లించాలి. ప్రస్తుతం కూలీలకు రోజుకు వారు చేసిన పనికి కొలతల ఆధారంగా సుమారుగా రూ.295 వంతున చెల్లిస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఉపాధి కూలీ రూ.307లకు పెంచడంతో క్లస్టర్ పరిధిలోని ఉపాధి పనులకు వచ్చే 73,820 కుటుంబాలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

నేటి నుంచి అమల్లోకి..



ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం ధరల సూచీ ఆధారంగా కూలి రేటు పెరుగుతది. ఈ ఏడాది పెరిగిన వేతనం ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తుంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల్లో పని చేసే కూలీలకు ప్రయోజనంగా ఉంటుంది.
– జనిపల్లి సుధారాణి, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, రాయవరం మండలం

అందరికీ పని



జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలి ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుత వేసవి కాలంలో అధిక సంఖ్యలో పనులు చేసుకునేందుకు అవకాశముంటుంది. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పిస్తాం.
– ఎం.ఈశ్వరరావు, ఇన్‌చార్జ్ ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, రామచంద్రపురం మండలం

మైనారిటీలకు చంద్రబాబు వెన్నుపోటు



మీడియాతో మాట్లాడుతున్న అలీఖాన్‌బాబా

మండపేట: ముస్లిం మైనారిటీలకు సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి వెన్నుపోటు పొడిచారని షేక్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మైనారిటీ సెల్ నాయకుడు షేక్ అలీఖాన్‌బాబా విమర్శించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల హామీలైన రంజాన్ తోఫా, షాదీ ముబారక్ వంటి పథకాలు అమలు చేయకుండా ముస్లిం మైనారిటీలపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోను అన్యాయం చేశారని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఇచ్చి చేతుల దులుపుకున్నారని విమర్శించారు. వైఎస్ హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తే దాన్ని బాబు తుంగలోకి తొక్కారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం తండ్రి బాటలో పయనించి 4 శాతం రిజర్వేషన్లకు న్యాయం చేకూర్చారని, నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలతో పాటు డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టిన ఘనత తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రంజాన్ తోఫా గానీ, మరణించిన కుటుంబాలకు ఇస్తానన్న లక్ష రూపాయలు గానీ ఇప్పటి వరకూ ఇవ్వక పోవడం దారుణమని అన్నారు. మైనారిటీలపై కూటమి ప్రభుత్వంలో దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. ముస్లింలకు కూటమి ప్రభుత్వంలో అడుగడునా అన్యాయం జరుగుతుందని, ఈ విషయాన్ని కూటమిలోని ముస్లిం మైనారిటీలు తెలుసుకోవాలని కోరారు.

వంటగ్యాస్ ధర పెంపుపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటి తినీతినకా కాలం వెల్లదీస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలపై వంటగ్యాస్ ధర పెంపు మూలిగే నక్కపై తాటిపండు పడ్డటయిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. ప్రభుత్వం తాజా వంటగ్యాస్ ధర పెంచాలని తీసుకున్న నిర్ణయంపై ఆయన స్పందిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ గ్యాస్ ధర పెంపును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు అదనపు భారం మోపితే పేద ప్రజలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర పెరిగిపోయాయని జనం గగ్గోలు పెడుతుంటే దానికి తోడు గ్యాస్ ధర పెంపు ఇంకా ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.900 నుంచి రూ.950కి పెరిగిందని సాధారణంగా ఒక కుటుంబం నెలకు ఒక సిలిండర్ వినియోగిస్తే, సంవత్సరానికి రూ.600 అదనంగా ఖర్చవుతుందని వివరించారు. సంపద సృష్టి అంటూ చేసిన ఊకదంపుడు ప్రసంగాలు మర్చిపోయారా అని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ధరలు పెంచి ప్రజలను అవస్థల పాలజేస్తున్నారని విమర్శించారు. ఇష్టానుసారం గ్యాస్ ధర పెంచేస్తే ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అని చెప్పి, ఆ డబ్బులు ఈ ఇలా లాక్కోవాలని చూస్తున్నారా అని అడిగారు. ఈ నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయమని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఈ విధమైన ఇబ్బందులకు గురి చేస్తే ప్రజలు సహించరని ఆయన హెచ్చరించారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కీర్తిస్పందన

రాయవరం: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ కూలీల మేట్లకు పని విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ వేసవిలో పనులు దొరక్క కూలీలు ఇబ్బందులు పడుతుంటారని, ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కూలీకి పని కల్పించడం ద్వారా వారికి ఉపాధిని కల్పించినట్టు అవుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, రామచంద్రపురం క్లస్టర్ ఏపీడీ కె.సత్యనారాయమణ, టెక్నికల్ అసిస్టెంట్ ఎన్.గంగాభవాని తదితరులు మాట్లాడారు. మండలంలోని 12 గ్రామాలకు చెందిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

కూటమి ప్రజా వ్యతిరేక విధానాలతో అధోగతి

- జిల్లా జాతాలో సీపీఐ నాయకులు



కపిలేశ్వరపురంలో జాతాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రం అధోగతి పాలవుతోందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు ఉద్ఘాటించారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా ప్రచార జాతాను నిర్వహిస్తుండగా జిల్లా జాతా మంగళవారం కపిలేశ్వరపురం చేరుకుంది. మండల కమిటీ నాయకులు జాతాకు ఘన స్వాగతం పలికారు. తొలుత వందేమాతరం గీత రచయిత బకిం చంద్ర చటోపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు కారణంగా దేశంలో 80 శాతం మంది ప్రజలు దుర్లభమైన జీవితాలను గడుపుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుండగా రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబునాయుడు కేంద్రానికి తాకట్టుపెట్టారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున కూటమికి మద్దతు పలికినప్పటికీ రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు విఫలమయ్యారన్నారు. 10 నెలలు గడుస్తున్నా కీలకమైన ఎన్నికల హామీలు ఏ మాత్రమూ అమలు కాకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. బీజేపీ, టీడీపీ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత తిరోగామి పథంలోకి నెట్టబడుతోందన్నారు. దేశంలో అతిపెద్ద ఆర్థిక వాటాగా ఉన్న ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తోందంటూ ప్రగల్భాలు పలికే మోదీ అమెరికా విధిస్తున్న అదనపు పన్నులు గురించి మాట్లాడకపోవడం విడ్డూరమన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాస రావు, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, మండల నాయకులు లంకే కామేశ్వరరావు, చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, గుత్తి నాగేశ్వరరావు, చిట్టూరి సత్యనారాయణ మాట్లాడుతూ సీపీఐ పార్టీ జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన తీరును వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి అన్నవరం, నామాల విష్ణు, మట్టపర్తి సత్యనారాయణ, ఉగ్గిరాల నాగరాజు, నవీన్, సవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలపై అప్రమత్తత అవసరం

- కాలువ స్నానాలకు వెళితే ప్రమాదాలు తప్పవు
- రూరల్ సీఐ దొరరాజు



మీడియాతో మాట్లాడుతున్న రూరల్ సీఐ దొరరాజు

మండపేట: వేసవి సెలవుల దృష్ట్యా తల్లిదండ్రులు పిల్లలపై జాగ్రత్తగా వ్యవహరించాలని రూరల్ సీఐ పి.దొరరాజు తెలియజేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వేసవి సెలవులు వచ్చిన తర్వాత పిల్లలు గుంపులుగా చేరి ఆటలాడుకోవడానికి ఆసక్తి చూపుతారని, కాలువల స్నానాలకు వెళ్లడానికి ఉత్సాహపడతారని, బైకులపై హల్చల్ చేస్తూ విచ్చలవిడిగా తిరగడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతుంటారని అన్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి ప్రమాదాల పాలై మృతి చెందే ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. చెరువులు, కాలువల స్నానాలకు దిగుతుంటారని అయితే అక్కడ ఎంత లోతు ఉంటుందనేది తెలియక ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అటువంటి పరిస్థితి రాకుండా తల్లిదండ్రులు ముందుగా తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని అన్నారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు..ఏం చేస్తున్నారనే నిఘా ఉంచాలన్నారు. సర్కిల్‌లోని అంగర, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలకు ఎక్కడైనా ఇలాంటి ఇబ్బందులు తలెత్తితే, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా గోదావరి నదీ తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లోని ప్రజలు వేసవిలో ఆరుబయట నిద్రిస్తుంటారని, దీనివల్ల చోరీలు అధికంగా జరిగే ప్రమాదం ఉందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఊరు వెళితే పోలీసులకు చెప్పాలని తెలియజేశారు. లాక్డ్ హౌస్ మోనిటరింగ్ (ఎల్‌హెచ్ఎంఎస్) సిస్టం అమర్చి దొంగతనాలు జరగకుండా నియంత్రిస్తామని ఆయన వివరించారు.

కమనీయం వేంకటేశ్వరుని కల్యాణం



కందులపాలెం వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుక

రామచంద్రపురం రూరల్: మండలంలో ప్రసిద్ధి చెందిన కందులపాలెం శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణం మంగళవారం రాత్రి కమనీయంగా జరిగింది. ధ్వజారోహణ, గరుడ వాహన, గజవాహన పల్లకీలలో గ్రామోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంగర శింగరాచార్యులు బ్రహ్మత్వంలో కల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ బొప్పన దొరరాజు దంపతుల చేతుల మీదుగా కల్యాణ పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా లక్ష్మీనారాయణుని కల్యాణం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి పాలక క్షేత్ర పరిధిలోని 12 గుండాల్లో ఒకటైన బ్రహ్మగుండం వద్ద వేంచేసిన భీమేశ్వరాలయ క్షేత్రపాలకుడు లక్ష్మీ సమేత నారాయణస్వామి దివ్య కల్యాణం మంగళవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామోత్సవం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహన అనంతరం స్వామి కల్యాణ క్రతువును అంగర ప్రభాకరాచార్యులు, బందావనం సత్యనారాయణాచార్యులు, సంపర గోపాలాచార్యులు, అంగర లక్ష్మీనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కమ్మవారి సావరంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న పిల్లి సూర్యప్రకాశ్

నేడు రథోత్సవం

వెలంపాలెం లక్ష్మీనారాయణుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నేటి మధ్యాహ్నం 3 గంటలకు స్వామి కల్యాణ రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. గ్రామ పురవీధుల నుంచి భీమేశ్వరాలయానికి తీసుకుని వెళ్లి మళ్లీ గ్రామానికి రథోత్సవాన్ని తీసుకువస్తారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం: పట్టణంలోని కమ్మవారి సావరంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుక పురస్కరించుకుని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ దంపతులు, వార్డు కౌన్సిలర్ గాదే రామలక్ష్మి, నాయకులు సత్తి శంకరరెడ్డి, పెంటపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జడ్జి శంకరరావుకు ఘన వీడ్కోలు



శంకరరావును సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

రామచంద్రపురం: చిత్తూరు పోక్సో కోర్టుకు బదిలీపై వెళుతున్న రామచంద్రపురం అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.శంకరరావుకు రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్‌వెంకటరమణ, హరినాథరెడ్డి, మాగాపు అమ్మిరాజు, కార్యదర్శి బొడ్డు నరసింహమూర్తి, సంయుక్త కార్యదర్శి జానకి తదితరులు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కోశాధికారి చింతపల్లి శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ సాదే నారాయణరావు, మహిళా రిప్రెజెంట్ లకాని పద్మకుమారి, జాయింట్ సెక్రటరీ శేషు, వాడ్రేవు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి గ్రామ ఆడపడుచులు ముడుపులు, మొక్కులు, కానుకలు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఘనంగా జరిపారు.

కాలువ పూడిక మట్టి తరలింపు



తొలగింపు పనులను పరిశీలిస్తున్న చెర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: రైతులకు సాగునీరు అందించేందుకు సుమారు నెల రోజల క్రితం గొల్లపుంత రోడ్డులో రామచంద్రుడు పంట కాలువలో పూడిక మట్టిని తొలగించారు. గొద్దు కాలువ వరకూ ఉన్న ఈ కాలువలోని మట్టిని జేసీబీ సాయంతో గుర్రపుడెక్క, మట్టిని బయటకు తీసి రోడ్డు పక్కన పోశారు. మట్టి దిబ్బల వల్ల వాహన రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి దృష్టికి వెళ్లడంతో సత్వర చర్యలు చేపట్టారు. మంగళవారం కాలువ వెంబడి ఉన్న మట్టి దిబ్బల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పర్యవేక్షణలో జేసీబీతో పనులు చేపట్టారు. దాని ద్వారా మట్టిని ట్రాక్టర్‌కు లోడ్ చేయించి బయటి ప్రదేశానికి తరలిస్తున్నారు. ఈ పనులను చైర్‌పర్సన్ దుర్గారాణి పరిశీలించారు.

విత్తన ధాన్యం సేకరణలో రైతుల బిజీ



బందనపూడిలో విత్తనాల సేకరణకు బల్లకట్టు కొడుతున్న రైతులు

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం విత్తనాల ధాన్యం సేకరణలో రైతన్నలు బిజీగా ఉన్నారు. కాజులూరు మండల గ్రామాల్లో వరి పొలాలు తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్నాయి. ఈ ఏడాది తొలకరిలో కాలువ నీరు సకాలంలో విడుదల కాకపోవడం, వర్షాలు సకాలంలో కురవక పోవడంతో ఖరీఫ్ సాగు ఆలస్యమై దాని ప్రభావం రబీపై పడింది. డివిజన్‌లోని పలు మండలాల్లో వరి కోతలు ప్రారంభమవగా కాజులూరు మండలంలో ఇప్పటికీ రైతులు ఎక్కువగా విత్తనాల ధాన్యం సేకరణలోనే ఉన్నారు. మండల గ్రామాల్లో వరి పొలాలు గింజగట్టిపడే దశలో ఉన్నాయి. విత్తన పంట సాధారణ పంట కంటే 15 నుంచి 20 రోజులు ముందుగానే కోతకు వస్తుంది. దీంతో పక్క పొలాల్లో నీరు తడి ఉండి విత్తన పొలాల్లో మాసూళ్లకు అవకాశం లేకపోవడంతో కోతకోసిన వరిని రోడ్లపైకి తెచ్చి కేళీలు కలవకుండా ఉండేందుకు బల్లకట్టు కొడుతున్నారు. విత్తన పంటను ఒడ్డుకు చేర్చి మిగిలిన పొలాలకు చివరి తడి అందించేందుకు సిద్ధమవుతున్నారు.

భూసారాన్ని పెంచే చర్యలు చేపట్టాలి



సబ్సిడీపై అపరాలను రైతులకు అందిస్తున్న ఏడీఏ రంగారావు, మేనేజర్ శ్రీనివాస్

కె.గంగవరం: రైతులు వేసవిలో భూసారాన్ని పెంచే చర్యలు చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.శ్రీనివాస్, రామచంద్రపురం ఏడీఏ ఏపీఎస్ రంగరావు సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరం మహిళా సమాఖ్య కార్యలయం వద్ద మంగళవారం రాబోయే తొలకరి సీజన్‌కు సంబంధించి సన్నద్ధతపై సమీక్షించారు. వారు మాట్లాడుతూ 30 రకాల విత్తనాలతో తయారు చేసిన పీఎంఎస్ కిట్‌లు రైతులు ఉపయోగించుకుని భూసారాన్ని పెంచుకోవాలన్నారు. వేసవిలో ఎటువంటి పంట లేకుండా భూమిని పూర్తిగా సూర్యరశ్మి తగిలేలా ఉండడం వల్ల ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించిపోవడంతో భూసారాన్ని కోల్పోతామన్నారు. కావున వేసవి పంటగా అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ప్రకృతి వ్యవసాయ విభాగం ద్వారా ఇచ్చే పీఎంఎస్ కిట్‌లు గాని వేసి భూసారాన్ని కాపాడుకోవాలని కోరారు. భూసారాన్ని అందించే అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ బలుసు రవి, అడిషనల్ డీపీఎం ఎంవీవీ శ్రీనివాస్, ట్రైనర్ బాబూరావు, వ్యవసాయ సహాయకులు మంజు, ప్రవల్లిక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.